## క్లుప్తంగా

### రమణ మహర్షి జీవితం ఆదర్శనీయం



జగన్నాథగిరిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బాబూశ్రీ

తుని రూరల్: భగవాన్ శ్రీరమణ మహర్షి జీవితం ఆదర్శనీయమని ప్రముఖ కవి, ఆంగ్ల అవధాని బాబూశ్రీ అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరి (రామకృష్ణ నగర్) కాలనీ శ్రీరమణమహర్షి ఆశ్రమంలో శనివారం రమణమహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు గొర్ల శివరామకృష్ణ ఆధ్వర్యంలో రమణమహర్షి భారీ చిత్రపటాన్ని ఆవిష్కరించి సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూశ్రీ మాట్లాడుతూ నిడారంబరతకు నిలువెత్తు నిదర్శనం రమణమహర్షి అన్నారు. అటువంటి మహనీయుల జీవితం ఆదర్శం, ఆచరణీయమన్నారు. బేహరా రమేష్ శర్మ ఆధ్వర్యంలో పండితులు గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణ, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. దాడిశెట్టి విష్ణుచక్రం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న . ధర్మకర్తలు, భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, శాంతిహోమం, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి, ప్రసాద వితరణ నిర్వహించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 1న స్వామివారికి పుల్లంగి సేవ, శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

### పింఛనుదారులకు న్యూ ఇయర్ కానుక



ప్రత్తిపాడులో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ప్రత్తిపాడు: పింఛనుదారులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. నూతన సంవత్సర కానుకగా పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచింది. కాగా సోమవారం నుంచి అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు పెంచిన పింఛన్ సొమ్ము రూ.250తో కలిసి మొత్తం రూ.3000 అందుకోనున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో అవ్వాతాతలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మండలంలో 11,947 మంది వృద్ధాప్య, వితంతు, ఒంటరి, చేనేత, కల్లుగీత పింఛను లబ్ధిదారులకు మేలు జరగనుంది.

### కొనసాగుతున్న ఆందోళనలు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న ఆందోళనలు శనివారం కొనసాగాయి. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ స్థానిక సచివాలయాల వద్ద ఆందోళన చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కె.సునీత, అమలావతి, వెంకటలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ మేట్లకు శిక్షణ



శంఖవరంలో ఉపాధిహామీ మేస్త్రీలకు శిక్షణ ఇస్తున్న ఏపీఓ రాజ్‌గోపాల్

శంఖవరం: మండలంలోని 14 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ మేట్లకు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉపాధి ఏపీఓ రాజ్‌గోపాల్ తెలిపారు. శంఖవరంలో శిక్షణా తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఉపాధి పనుల గుర్తింపు, హార్టికల్చర్, చెరువులు, కాలువల్లో పూడిక తీత పనులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. గ్రామాల్లోని ఉపాధి హామీ మేట్లు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

# దశాబ్దాల కల సాకారం

- తాండవ నదిపై కాజ్‌వే.. హైలెవల్ బ్రిడ్జిగా అభివృద్ధి
- మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో రూ.10 కోట్లు మంజూరు
- తీరనున్న 50 గ్రామాల ప్రజల అవస్థలు



కోటనందూరులో తాండవనదిపై శిథిలావస్థకు చేరిన కాజ్‌వే



బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా (ఫైల్)

కోటనందూరు: కోటనందూరు పరిసర ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల సాకారమైంది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో కోటనందూరులో తాండవ నదిపై ఉన్న కాజ్‌వే హైలెవల్ బ్రిడ్జిగా అభివృద్ధి చెందుతోంది. మంత్రి రాజా కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సుమారు 50 గ్రామాల ప్రజలకు రాకపోకల అవస్థలు తీరడంతో పాటు ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన మంత్రి దాడిశెట్టి రాజాకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**1976లో కాజ్ వే నిర్మాణం**

తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి కోటనందూరు గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్న తాండవ నదిని దాటాలి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రయాణికులు సాధారణ రోజుల్లో నదిలోకి దిగి రాకపోకలు సాగిస్తుండేవారు. వరదల సమయంలో తెప్పల సహాయంతో నదిని దాటి గమ్యాలకు చేరుకునేవారు. ఈ పరిస్థితి అప్పట్లో రైతులతో పాటు ప్రయాణికులను చాలా ఇబ్బందులకు గురి చేసేది. అప్పటి పాలకులు, రైతుల ఆర్థిక భాగస్వామ్యంతో ప్రభుత్వం రూ. 13 లక్షలు ఖర్చు చేసి 1976వ సంవత్సరంలో తాండవ నదిపై కాజ్‌వే(బ్రిడ్జి)ని నిర్మించారు. అప్పటి ప్రజల అవసరాలు, రోడ్ల పరిస్థితులకు అనుగుణంగా నిర్మించిన ఈ కాజ్‌వే ఆనాటి ప్రజల ఇబ్బందులను తొలగించింది. కాలక్రమంలో ఈ కాజ్‌వే శిథిలం కావడం, కాజ్ వేకు రెండువైపులా రక్షణ లేకపోవడం, ఎత్తు, వెడల్పు, కింద ఫిల్లర్ల మధ్య దూరం తక్కువగా ఉండడం వంటి కారణాలతో ప్రస్తుతం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వరదల సమయంలో నదిలో నీరు కాజ్‌వే పై ఉధృతంగా ప్రవహించి తుని–నర్సీపట్నం రోడ్డుకు, కోటనందూరు గ్రామానికి పూర్తిగా సంబంధాలు తెగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాజ్‌వేను బ్రిడ్జిగా అభివృద్ధి చేయాలని గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో..**

మండలంలోని కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్లీపేట, కోటనందూరు గ్రామాలతో పాటు రౌతులపూడి, శంఖవరం, అనకాపల్లి జిల్లా నాతవరం మండలాల్లోని 50 గ్రామాల ప్రజలు తుని–నర్సీపట్నం రోడ్డుకు చేరుకునేందుకు తాండవ కాజ్‌వే గుండా రాకపోకలు సాగిస్తుంటారు. తుపానుల సమయంలో తాండవ నదిలోని వరద నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహించి రాకపోకలు స్తంభించడంతో పాటు నది పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ సమస్యను స్థానికులు మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకొస్తానని గత ఎన్నికల సమయంలో మంత్రి హామీ ఇచ్చారు. ఈ మేరకు సమస్యను సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

**అన్ని రకాలుగా అభివృద్ధి**



తుపాను సమయంలో కాజ్‌వే పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

కోటనందూరులో తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. కోటనందూరులో తుని–నర్సీపట్నం రోడ్డు నుంచి పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, రౌతులపూడి, శంఖవరం మీదుగా కత్తిపూడి వద్ద 216 నంబరు హైవేకు చేరుకునేందుకు 33 కిలోమీటర్ల పొడవు గల రోడ్డు ఉంది. కాగా కోటనందూరులో తాండవ నదిపై సరైన బ్రిడ్జి లేకపోవడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఈ రోడ్డు లూప్‌లైన్‌గానే మిగిలిపోయింది. ఇక్కడ ఉన్న కాజ్‌వే బ్రిడ్జిగా అభివృద్ధి చెందితే సౌకర్యవంతమైన ప్రయాణంతో పాటు రోడ్లు, వ్యాపార వనరులు, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

**గత పాలకులు పట్టించుకోలేదు**

తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రజల రాకపోకలతో పాటు ఈ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందుతుంది. వరదలు, అత్యవసర సమయాల్లో సైతం ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుంది. ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా బ్రిడ్జి నిర్మించాలని డిమాండు చేస్తున్నా.. గత పాలకులు ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు బ్రిడ్జి అభివృద్ధికి నోచుకోవడం సంతోషించదగ్గ విషయం. అందుకు కృషి చేసిన మంత్రి దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు.



– వాదపర్తి సుబ్బు, కోటనందూరు

## కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం



కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక ఊరకాలువ గట్టుపై వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, వల్లీదేవి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాలంకి సాయిబాబా, రమణకుమారి, రాయి భద్రం, అరిసెపు రాంబాబు, పెద్దాడ వెంకన్నదొర, ద్విభాష్యం సూర్యవెంకటసుబ్బారావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా క్రిస్మస్ వేడుకలు



గోకవరం క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ట్రాన్స్‌కో ఏఈ అశోక్ ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసు సర్వలోక రక్షకుడని, ఆయన బోధనలు ఆచరణీయమన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పులపర్తి బుజ్జి, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి ఏసురత్నం, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్రాకు అనూహ్య స్పందన



లింగంపర్తిలో వాలీబాల్ ఆడుతున్న యువత

తుని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు అనూహ్య స్పందన వస్తోందని శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ అన్నారు. తుని రాజా కళాశాల మైదానంలో ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను శనివారం ఆయన తిలకించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, క్రికెట్ తదితర క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొనడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటుకునేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించేందుకు కృషి చేయాలన్నారు. వివిధ పోటీల్లో రాణించిన క్రీడాకారులను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, డీఎస్‌డీవో శ్రీనివాస్, గ్రౌండ్ ఇన్‌చార్జి పాపారావు, పోటీల ఇన్‌చార్జి ప్రశాంత్ కుమార్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

**హోరాహోరీగా క్రీడా పోటీలు**

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో యువత ఎక్కువగా పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా మారాయి. మండల స్థాయిలో తహసీల్దార్ చిన్నారావు, పట్టణ



తునిలో క్రీడాకారులకు సూచనలిస్తున్న శాప్ ఎండీ ధ్యాన్‌చంద్


పరిధిలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోటీలు నిర్వహించారు. లింగంపర్తి ఖోఖో, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొని పోటీలను తిలకించారు.

**ఉత్సాహంగా క్రీడా పోటీలు**

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ యువతకు కబడ్డీ, క్రికెట్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. తొండంగి జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం ఎంపీడీఓ పసుపులేటి సతీష్, కార్యదర్శి రాజబాబుల ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. గ్రామ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంపీడీఓ సతీష్ తెలిపారు.

# విద్యార్థులకు ఆనంద నిలయం

- వసతి గృహం విద్యార్థులకు మెరుగైన వసతులు
- రూ.15 లక్షల సీఎస్సార్ నిధులతో నూతన బ్లాక్
- ప్రారంభించిన కలెక్టర్ కృతికా శుక్లా



ఆనంద నిలయం వసతి గృహంలో నూతనంగా నిర్మించిన బ్లాక్‌ను ప్రారంభించిన కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో రూ.15 లక్షల సీఎస్సార్ నిధులతో అదనపు వసతి గదులు నిర్మించినట్టు కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల దగ్గర ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఆనంద నిలయంలో కాకినాడ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించిన బ్లాక్‌ను జిల్లా సాంఘిక సంక్షేమశాఖ, కోరమాండల్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పరుపులు, ఇతర సామగ్రిని అందజేసి, పిల్లలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఆనంద నిలయం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికే ఆనంద నిలయం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆర్వో ఫిల్టర్, వాషింగ్ మెషీన్, టీవీ, ఇతర చిన్న చిన్న వసతులు కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ డీవీ రమణమూర్తి, సీపీవో పి.త్రినాథ్, కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, ఆనంద నిలయం వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే క్రాసింగ్‌ల పరిశీలన

పిఠాపురం: రైల్వే క్రాసింగ్‌ల వద్ద పరిస్థితులను విజయవాడ రైల్వే సెక్షన్ సీనియర్ ఇంజినీర్ టి.అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు అధికారులు పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులు శనివారం గొల్లప్రోలు నగర రైల్వే పరిధిలో సూరంపేట, మల్లవరం రైల్వే గేట్ల వద్ద ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలపై సర్వే నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల రాకపోకలు పెరగడంతో పాటు ప్రజలు పడుతున్న ఇబ్బందులను విశ్లేషించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



తూర్పులక్ష్మీపురంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

ఏలేశ్వరం: మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శనివారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పయనించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యిజనగిరి సత్యవతి, మహిళలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**జోరుగా సేవా కార్యక్రమాలు**

ప్రత్తిపాడు: ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఏఓ శ్రీనివాసు, ఈఓపీఆర్డీ కె.కాశీవిశ్వనాథం, ఏపీఓ కుమారస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, గుడాల వెంకటరత్నం, పత్రి రమణ, పినిశెట్టి ప్రకాష్, ఆకుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పర్వత జన్మదిన వేడుకలు**



రౌతులపూడిలో కేక్ కట్ చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

రౌతులపూడి: ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. అనంతరం ప్రత్తిపాడు ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి సాయి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణతో కలిసి ఆయన స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

## గణపతికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: సంకట హర చతుర్థిని పురస్కరించుకుని శనివారం తూళ్లూరులోని విజయ గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు ఉదయం స్వామివారికి తేనె, పంచామృతాలతో అభిషేకం, గరిక పూజ చేశారు. ఉండ్రాళ్లను నైవేద్యంగా పెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

జగ్గంపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై కె.నాగార్జునరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట మండలం రామవరం సమీపంలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన గాది మహాలక్ష్మి (62) శనివారం ఉదయం కూలి పనికి వెళుతూ భగత్ సింగ్ నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహాలక్ష్మిని స్థానికులు 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## రైల్వే స్టేషన్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ రైల్వే స్టేషన్ ఉత్తమ నిర్వహణకు సంబంధించి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేశారని ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్టేషన్‌లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ప్లాట్‌ఫారాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండటం, టిక్కెట్ల విధానం సక్రమంగా జరగడం, ప్రయాణికులకు నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు అందించడంతో ఈ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న వివిధ శాఖల అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందన్నారు.

**నేడు సామర్లకోటకు అమృత్ భారత్**

రైల్వే శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం సామర్లకోటకు వస్తుందని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

## చేనేత కార్మికులకు సోలార్ కిట్ల పంపిణీ



బెండపూడిలో చేనేత కార్మికులకు సోలార్ కిట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని బెండపూడిలో చేనేత కార్మికులకు శనివారం సోలార్ కిట్లు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాయితీపై చేనేత కార్మికులకు ఫ్యాన్లు, బల్బులు సోలార్ ప్యానల్స్‌ను అందిస్తోంది. కాగా గ్రామంలోని 26 మంది లబ్ధిదారులకు ఈ కిట్లను వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమిశెట్టి చలపతి, ఎంపీటీసీ గొంతెన నాగేశ్వరరావు, బూసాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలే లక్ష్యం



తునిలో కమిషనర్ ప్రసాదరాజును సత్కరిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు

తుని: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తుని పురపాలక సంఘం సెంచరీ రికార్డును సాధించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 12వ వార్డులో శనివారం కౌన్సిలర్ బుద్దిగ దారేష్ ఆధ్వర్యంలో 100వ సీసీ రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పట్టణాభివృద్ధికి సహకరించిన కమిషనర్ ప్రసాదరాజు, డీఈఈ ప్రకాశరావు, ఏఈ అభిలాష్‌ను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, ప్రముఖ వ్యాపారవేత్త చక్కా తాతబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీను, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, పోతల రమణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీలకు ఘన సన్మానం



సర్పవరంలో సత్కారం అందుకుంటున్న బ్రహ్మకుమారిలు

కాకినాడ రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బ్రహ్మకుమారీస్ శాఖల ఇన్‌చార్జి రజనీ దీదీ 62వ జన్మదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీలకు శనివారం ఘనంగా సన్మానం నిర్వహించారు. సర్పవరంలోని డీజీబీ కల్యాణ మండపంలో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్లుగా బ్రహ్మకుమారీల ఆశ్రమంలో భాగస్తులుగా ఈశ్వరుని సాన్నిధ్యంలో తమ జీవితాన్ని గడుపుతున్న 108 మంది బ్రహ్మకుమారీలతో పాటు 50 వసంతాలు పూర్తి చేసుకుని ఈశ్వరునికి జీవితాన్ని అర్పించిన మరో ఏడుగురిని సన్మానించారు. కార్యక్రమంలో విజయనగర బ్రహ్మకుమారీస్ శాఖల ఇన్‌చార్జి బీకే అన్నపూర్ణ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రజనీ దీదీ, అన్నపూర్ణలు బ్రహ్మకుమారీలను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.